పదవి లేకున్నా ప్రజాసేవ చేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్ : పదవి లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల అభివృద్ధికి ఐదేళ్లుగా అందరి సహకారం మరువలేనిదని అన్నారు. చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఎంపీటీసీలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీ తదితరులు పాల్గొన్నారు.

పొలంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటును అడ్డుకున్న రైతులు

శంషాబాద్: ఓ బడా వ్యాపారికి చెందిన స్థలంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తీసి విద్యుత్ అధికారులు తన పొలంలో వేస్తున్నారని గురువారం కొత్వాల్‌గూడ రైతు కూకుంట్ల యాదయ్య స్థానిక రైతులతో కలిసి అడ్డుకున్నాడు. ఫోర్ట్ గ్రాండ్ పక్కనే ఉన్న వ్యవసాయ పొలం సర్వే నంబరు 125, 126లో లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జేఎల్ఎం గోపాల్ ఆదేశాలతో విద్యుత్ సిబ్బంది స్తంభాలు వేయడానికి పొలం వద్దకు వచ్చారు. తన అనుమతి లేకుండా పొలంలో స్తంభాలు ఎలా వేస్తారని రైతు యాదయ్య కుటుంబ సభ్యులు, స్థానిక రైతులు విద్యుత్ సిబ్బందిని అడ్డుకున్నారు. దీంతో అక్కడి నుంచి సిబ్బంది వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతు కోరారు.

మురుగుతో దుర్వాసన

- పందెన్‌వాగులో కలుస్తున్న మురుగు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఎస్టీపీలను ఏర్పాటు చేసి నాలాను మళ్లించాలని డిమాండ్



చెక్ డ్యాం కట్టాల్సిన ప్రాంతం

మణికొండ: నాలాలు, చెరువులలో మురుగునీరు కలపవద్దని అనేక కోర్టులతో పాటు గ్రీన్ ట్రిబునల్, కాలుష్య నియంత్రణ మండలి సైతం పలు మార్లు ఆదేశాలు జారీ చేశాయి. అందుకు భిన్నంగా పైనున్న ప్రాంతాల నుంచి వచ్చే దుర్గంధంతో కూడిన మురుగు నీటితో పాటు స్థానిక మురుగు నీరంతా ఒకే వాగులో కలుపుతున్నారు. దీంతో చుట్టుప్రక్కల వారికి కంపు కొడుతోంది. ముక్కులు మూసుకుని జీవించాల్సిన దుస్థితి ఏర్పడింది. మణికొండ మున్సిపాలిటీకి పైనున్న నానక్‌రాంగూడ, రాయదుర్గం, కొండాపూర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల మురుగు నీరంతా నానక్‌రాంగూడ, ఖాజాగూడ, దుర్గం చెరువు, మల్కం చెరువుల ద్వార బుల్కాపూర్ నాలా, పందెన్‌వాగుల ద్వార మణికొండ మీదుగా మూసీ నదికి చేరుతుంది. నానక్‌రాంగూడ, దుర్గం చెరువులలో ఎస్టీపీలు ఉండగా.. మిగతా చోట్ల లేకపోవటంతో డ్రైనేజీ దుర్గంధం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి, ట్రయల్స్‌విల్లాస్, శ్రీనివాసనగర్, సెక్రటేరియట్ కాలనీ, బయోడ్‌కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఈవీవీ కాలనీల మీదుగా నెక్నాంపూర్ చెరువుకు చేరుతుంది. ఆయా కాలనీలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందటంతో నాలాను ఆనుకుని సైతం నిర్మాణాలు జరిగాయి. దుర్గంధం విషయం తెలియని వందలాది మంది ఆయా నిర్మాణాలతో తమ నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో పందెన్‌వాగు నాలా సామర్థం సరిపోక నాలా పక్కనున్న అపార్ట్‌మెంట్‌లు, గృహాలు, రోడ్లపైకి వస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది తమ గృహాలను అమ్ముకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు కూడా ఉన్నారు.

ముంపు సమస్యకు కొంత పరిష్కారం...

వరదలు వచ్చిన సమయంలో మొదటగా ముంపునకు గురయ్యేది పంచవటి కాలనీ. అప్పటి గ్రామ పంచాయతీ రూ.కోటి వరకు ఖర్చు చేసి రిటర్నింగ్ వాల్‌ను నిర్మించింది. ఆ నిధులు ఏమాత్రం సరిపోకపోవటంతో నాటి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.4.50 కోట్లను మంజూరు చేయడంతో అప్పటి మంత్రి హరీష్‌రావు పనులను ప్రారంభించారు. పంచవటి కాలనీ తరువాత ట్రయల్స్ విల్లాల వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణానికి ప్రస్తుత మున్సిపాలిటీ ఏకంగా రూ.9.80 కోట్లను ఖర్చు చేసింది. దాంతో వరద ముంపు సమస్య తప్పింది. సెక్రటేయట్ కాలనీ, ఎంప్లాయీస్ కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, బయోడ్ కాలనీ, తిరుమలహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఈవీవీ కాలనీలలోనూ బాక్స్ డ్రైన్‌ను నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పరిష్కారం ఇదే...

మణికొండ మున్సిపాలిటీకి పైనున్న ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు గతంలో బుల్కాపూర్ నాలా ద్వార షేక్‌పేట మీదుగా హుస్సేన్ సాగర్‌కు చేరేది. దాన్ని పంచవటి కాలనీ రామాలయం సమీపంలో బుల్కాపూర్ నాలాను ఎత్తు చేసి షేక్‌పేట మురుగు నీరు సైతం మణికొండ వైపు వచ్చేలా మళ్లించారు. దాంతో పాటు నిర్మాణాలు, ప్రజలు పెరిగిపోవటంతో ప్రతి రోజు లక్షల లీటర్ల మురుగునీరు బయటకు వచ్చి బుల్కాపూర్, పందెన్‌వాగులలో కలుస్తుంది. దాన్ని పంచవటి రామాలయం సమీపంలో ఓ చెక్ డ్యాం నిర్మాణం చేసి పైనుంచి వచ్చే మురుగు నీటిని షేక్‌పేట వైపు మళ్లిస్తే పందెన్‌వాగులో నీటి ప్రవాహం తగ్గుతుందని పలువురు జలవనరుల నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో పాటు ఎంప్లాయీస్ కాలనీ నుంచి నెక్నాంపూర్ చెరువు వరకు వీలైనంత సామర్థ్యంతో బాక్స్‌డైన్ నిర్మాణం చేపట్టాలని వారు సూచిస్తున్నారు. వీటితో పాటు రాయదుర్గం డివిజన్ పరిధిలోని మల్కం చెరువు, మణికొండ మున్సిపాలిటీల పరిధిలోని ఎల్లమ్మచెరువు, నెక్నాంపూర్ చెరువుల వద్ద ఎస్టీపీలను ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే చొరవ చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపిస్తాం



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించుకోవాల్సి ఉంటుంది. హుస్సేన్ సాగర్‌కు వెళ్లాల్సిన మురుగు నీటిని పందెన్ వాగులోకి కలపటం అప్పట్లో జరిగిన తప్పు. ప్రస్తుతం ఆ నీరు అటు వైపే వెళ్లేలా చెక్‌డ్యాం, పలు చోట్ల ఎస్టీపీలు, బాక్స్ డ్రైన్ నిర్మాణ ఆవశ్యకతలను వివరిస్తూ కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

– డి. ప్రదీప్‌కుమార్,
మున్సిపాలిటీ కమిషనర్



మురుగునీటిని పందెన్‌వాగులో కలపవద్దని కొత్తగా వస్తున్న గేటెడ్ కమ్యూనిటీ ఎదుట ఆందోళన చేస్తున్న స్థానికులు(ఫైల్)

వార్డు కార్యాలయాన్ని అప్పగించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మణికొండ : ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లను తరలించి, వార్డు కార్యాలయాన్ని తమకు అప్పగించాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, 17వ వార్డు కౌన్సిలర్ ఉషారాణి జిల్లా కలెక్టర్ శశాంకను కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలోనే ఇదే విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారం రోజుల్లో వాటిని తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు.

పేద విద్యార్థులకు సహకారం



విద్యార్థినులకు చెక్కులందజేస్తున్న ఉపేంద్రనాథ్‌రెడ్డి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించి ఉన్నత చదువులు చదువుకోవాలనుకునే విద్యార్థులకు తమ సంస్థ దాతల సహకారంతో అండగా నిలుస్తుందని వీఆర్‌ఫర్‌యూ సహయోగ్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎ.లక్ష్మణ్‌రావు అన్నారు. మణికొండ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న వి.మహేశ్వరి, మొదటి సంవత్సరం చదువుతున్న పి.చంద్రికలకు రెండు దఫాలుగా ఫీజులు చెల్లించేందుకు గురువారం ది సిటిజన్ కౌన్సిల్ కార్యదర్శి, బిల్డర్ బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి చెక్కులను అందజేశారు. మరో విద్యార్థిని పూజాసింగ్‌కు స్థానిక శ్రీరామ్ ఎముకల ఆసుపత్రి డాక్టర్ బి. శ్రీనివాస్ గతంలోనే ఫీజు చెల్లించారన్నారు. తమ సంస్థ దాతల సహకారంతో ఆరుగురు విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో దిలీప్‌కక్కడ్, సీతారాం, రామసుబ్బారెడ్డి, నిర్మల్‌చంద్ పాల్గొన్నారు.

ఐఎస్‌బీ ఆధ్వర్యంలో 'పాలసీవాక్'

రాయదుర్గం: విధాన రూపకల్పన, అమలులో ప్రత్యక్ష అనుభవాన్ని పొందడానికి వినూత్న కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీ విద్యార్థులు మూడు రోజుల పాటు పబ్లిక్ పాలసీ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈ కార్యక్రమం గురువారం ముగిసింది. ఐఎస్‌బీ పబ్లిక్ పాలసీ డైరెక్టర్ డాక్టర్ ఆరుషిజైన్ ఆధ్వర్యంలోని విద్యార్థులు, ప్రొఫెసర్ అంజల్‌ప్రకాశ్ పర్యవేక్షణలోజరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, నీతి ఆయోగ్ సీఈఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం ,వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశంలో పౌరసేవల నిర్వహణ, దేశవ్యాప్తంగా గ్రామీణ పారిశుద్ధ్యం, పోర్టబుల్ నీటి సరఫరా సవాళ్లు, పురోగతి, భారత్–బెల్జియం దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, చిక్కులు, భారత్‌లో ఎన్నికల విధానం, దేశంలో సమర్థవంతమైన పాలన వంటి అంశాలపై చర్చించారు. వారి అభిప్రాయాలను ప్రకటించారు.

పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి

రాయదుర్గం: నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని గోపన్‌పల్లిలో రూ.30 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు, రాజీవ్‌నగర్‌లో రూ.15 లక్షలతో చేపట్టిన భూగర్భడ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యత విషయంలో రాజీపడకుండా నిర్ణీత సమయంలో సీసీరోడ్డు, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికే బస్తీబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మంతు నాయక్, శ్రీనివాస్, ప్రభాకర్, మురగ, ఎం రమేష్, రంగస్వామి, శ్రీకాంత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, మల్లేష్, గోపన్‌పల్లి, రాజీవ్‌నగర్‌వాసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సాక్షి ఎఫెక్ట్..



బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రతినిధి సురేష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ ప్రతినిధి సురేష్‌గౌడ్ అన్నారు. ఎక్సైజ్ అకాడమీ నుంచి కిస్మత్‌పూర్ వివేకానంద విగ్రహం వరకు మధ్యలో రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై గత నెల 25వ తేదీన సాక్షి దినపత్రిలో 'ఆదమరిస్తే అంతే' అనే శీర్షికతో వార్తను ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు బీటీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. పనులను కార్పొరేటర్ ప్రతినిధి సురేష్‌గౌడ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పూర్తిగా రోడ్డు పనులు నిర్వహించేందుకు కృషి చేసినా పలు కారణాలతో నిలిచిపోయాయన్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా అధికారులతో చర్చించి బీటీ రోడ్డు పనులను పూర్తి చేయించేందుకు పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: రోడ్డు నిర్మాణంలో నాణ్యత తప్పనిసరని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధి 19వ డివిజన్‌లోని ఇంద్రారెడ్డినగర్ కాలనీలో సుమారు రూ.51 లక్షల నిధులతో నూతనంగా సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. దశల వారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని వివరించారు. అభివృద్ధి పనులకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ స్రవంతినరేందర్, ప్రేమ్‌గౌడ్, నాగుల నరేందర్, ఆంజనేయులు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని ఆయా సర్కిళ్ల పరిధిలో ముంపు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఇంజనీరింగ్, బయోడైవర్సిటీ, విద్యుత్, శానిటేషన్ అధికారులతో కలిసి ఆయన సుడిగాలి పర్యటన చేశారు. వాటర్ లాగింగ్ పాయింట్లతో పాటు బాక్స్ డ్రెయిన్ నిర్మాణాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు సంబంధిత విభాగాల అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. నాలాల్లో పూడిక తీయాలని, మ్యాన్‌హోళ్లు, నాలాలు, కల్వర్టుల వద్ద ప్రమాదాలు జరకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.భారీ వర్షం వచ్చినప్పుడు వరదకు అడ్డుగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని, కొన్ని విద్యుత్ స్తంభాలను మార్చాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఈదురు గాలులు, భారీ వర్షాలకు చెట్లు విరగడం, గ్రీన్ వేస్ట్‌ను వెంటనే తొలగించేలా సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ రజినీకాంత్‌రెడ్డి, జోన్ ఎస్ఈ శంకర్, ఈఈ శ్రీనివాస్,ఏసీపీ మెగ్రా, ఏఎంఓహెచ్ డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు కలిసికట్టుగా హక్కులు సాధించుకోవాలి

గోల్కొండ: దివ్యాంగులు కలిసికట్టుగా తమ హక్కులు సాధించుకోవాలని మజ్లిస్ యూత్ విభాగం నాయకుడు యాసర్ అరఫాత్ అన్నారు. మజ్లిస్ వికలాంగుల సంఘం గ్రేటర్ అధ్యక్షుడు జాహెద్ ఆలీ గురువారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టాయన్నారు. దివ్యాంగుల కోసం స్వయం ఉపాధి పథకాలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీసీపీ రాజేష్‌కు సన్మానం



డీసీపీ రాజేష్‌ను సన్మానిస్తున్న పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్

శంషాబాద్ : శంషాబాద్ జోన్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్‌ను గురువారం కాంగ్రెస్ నేతలు ఆయన కార్యాలయంలో కలిశారు. పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ డీసీపీని సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

కోఠి ఈఎన్‌టీ ప్రభుత్వ ఆసుపత్రికి విరాళం

సుల్తాన్‌బజార్: కోఠి ఈఎన్‌టీ ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ఏబీఎస్.రావు ఆడిటోరియంలో ఎన్‌టీపీసీ సౌత్ రీజియన్ హెడ్ క్వార్టర్ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ పాణిగ్రామి, డీజీఎం బద్రుద్దీన్ అన్సారి, మేనేజర్ ప్రియాంక తదితరులు రూ.9.47 లక్షల విలువ చేసే పేద రోగుల సౌకర్యార్థం ఉపయోగపడే పరికరాలను విరాళంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌కు అందజేశారు. అనంతరం వారిని సూపరింటెండెంట్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓపీ డాక్టర్ జయమనోహరి, ప్రొఫెసర్ అండ్ హెచ్ఓడీ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, కేవీ.ఎస్.దుర్గాప్రసాద్, డాక్టర్ రవిశంకర్ ప్రజాపతి, ప్రొఫెసర్ అండ్ అనస్థీషియా డాక్టర్ కె.ఉమా, డాక్టర్ వీణ, నర్సింగ్ ఆఫీసర్స్ స్వర్ణలత, పుష్పాలత, కేజియా, మాధవి, సరిత, మరియ, రవి, మధు, రజిని పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యమివ్వాలి

అబిడ్స్: తెలంగాణ ప్రజా ప్రతినిధులకు టీటీడీ అధికారులు తగిన ప్రాధాన్యమివ్వాలని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. కొన్ని రోజులుగా తెలంగాణలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల సిఫారస్ లెటర్లకు టీటీడీ అధికారులు సరైన ప్రాధాన్యమివ్వడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. టీటీడీ ఈఓ శ్యామల రావును కలిసి టీటీడీ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈఓ శ్యామలరావు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇక ముందు తెలంగాణ ప్రజా ప్రతినిధులందరికీ ప్రతి సిఫారస్ లెటర్‌కు ప్రాధాన్యత ఇస్తామని శ్యామలరావు వివరించినట్లు పోల్కం శ్రీనివాస్ వెల్లడించారు. టీటీడీ అధికారుల తీరుపై ఇటీవలనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు తాను ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

సేంద్రియ ఎరువు తయారీని పరిశీలన



ఎరువును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఉన్న చెత్త డంపింగ్‌యార్డు, తడిచెత్త, పొడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని గృహాలు, షాపుల నుంచి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి.. తడి చెత్తతో వర్మి కంపోస్టు ఎరువు, పొడి చెత్తను జవహర్‌నగర్‌కు తరలించే పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పొడి చెత్తలో ప్లాస్టిక్, అట్టలు, బాటిళ్లను వేరు చేసే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ నరసింహరాజు, శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం, డంపింగ్ యార్డు సూపర్‌వైజర్‌లు చందు, వినోద్ పాల్గొన్నారు.

కేశవనగర్ ప్రభుత్వ పాఠశాలలో 'ప్రాజెక్ట్ ప్రజ్ఞా'



'మంథన్' విద్యార్థుల ఔదార్యం

రాయదుర్గం: 'మంథన్' పాఠశాల విద్యార్థులు ఔదార్యం ప్రదర్శించారు. ఒకవైపు విద్యనభ్యసిస్తూ ఇంకోవైపు సేవాభావంతో అడుగులు వేస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గొలిదొడ్డి కేశవనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 'ప్రాజెక్ట్ ప్రజ్ఞా' పేరుతో విద్యావ్యాప్తి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కేంబ్రిడ్జ్ బోర్డులోని 9వ తరగతి విద్యార్థులు పది మంది ,ఉపాధ్యాయులు అయిదుగురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో 1నుంచి 5 తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, సైన్స్, గణితం, శారీరక విద్య (పీఈటీ) బోధనపై దృష్టి సారించారు. స్టేషనరీ కిట్లు, నోట్‌బుక్స్, బోధన సామగ్రి అందించారు. ఈ సందర్భంగా మంథన్ స్కూల్ ప్రిన్సిపల్ సుర్జీత్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం అవసరమన్నారు. ప్రతి బిడ్డ మన దేశభవిష్యత్తు అని మనం గుర్తించాలన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందాలి: ఎమ్మెల్యే కౌసర్



డీజీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గోల్కొండ: ప్రతి ఇంటికి తాగునీరు అందాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ, ఎండిలైన్స్, అక్బర్‌పురా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం టోలిచౌకీ వద్ద జలమండలి డీజీఎంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్ల నుంచి తాగునీరు అందడం లేదని తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ ఫిర్యాదు అందిన వెంటనే తాను నల్లాలో నీరు వచ్చే సమయంలో ఆయా బస్తీల్లో పర్యటించానని ఎన్నో నల్లాల్లో చుక్క నీరు రావడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. జలమండలి సాంకేతిక సిబ్బందిని ఫిర్యాదులు అందిన చోట పర్యటించి తాగునీటి పైపులైన్‌లను పరిశీలించాలని ఆయన కోరారు. ప్రమాదంలో కాలుకు ఫ్యాక్చర్ అయి కూడా విధులు నిర్వహిస్తున్న జలమండలి డీజీఎం ఖాజా జవహర్ ఆలీ పనితీరును ఆయన ప్రశంసించారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్‌తో పాటు మజ్లిస్ హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

కోట మైసమ్మ ఆలయ అధ్యక్షుడిగా బాబురాజా

చార్మినార్: అలీజాలోని కోట మైసమ్మ అమ్మవారికి ఈసారి బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయికోట్ బాబు రాజా తెలిపారు. ఈసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తనతో పాటు కమిటీ ఏర్పడిందన్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా కె.రాజ్‌కుమార్, ఎ.యాదగిరి యాదవ్, కోశాధికారిగా ప్యారసాని వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా కె.అశోక్ యాదవ్, కార్యదర్శిగా ఎస్.విజయ్ గౌడ్ తదితరులు నియమితులయ్యారని బాబురాజ్ తెలిపారు.

నాలా పనుల పరిశీలన

యాకుత్‌పురా: రెయిన్ బజార్ డివిజన్‌లో గురువారం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి నాలా పనులను పరిశీలించారు. యత్రఫ్ నగర్, మదీనానగర్, ఎస్ఆర్టీ కాలనీ, ఇమాంబాడా ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా అభివృద్ధి పనులను పరిశీలించి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. రానున్న భారీ వర్షాలకు ప్రజలకు ఎ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

బోనాల నిర్వహణలో మైత్రి కమిటీ సభ్యుల సహకారం

గోల్కొండ: గోల్కొండ కోట బోనాల నిర్వహణలో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ప్రతి యేటా పోలీసులకు తమ సహాయ సహకారాలు అందిస్తున్నారని గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ అధ్యక్షుడు ఆబిద్ అన్నారు. గురువారం మైత్రి కమిటీ సభ్యులతో కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..దశాబ్దాలుగా గోల్కొండ అమ్మవార్ల బోనాల ఏర్పాట్లలో స్థానిక హిందూ ముస్లిం సోదరులంతా కలిసి పని చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం బోనాలకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అందరు కలిసికట్టుగా బోనాలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మైత్రి కమిటీ సభ్యులు జంగయ్య, ఏ.పరమానందం, ఇమ్రాన్ అలీఖాన్, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, సత్యంరెడ్డి తదితరులున్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో 'స్వచ్ఛ భారత్'



గోల్కొండ: ఆసుపత్రికి వచ్చేరోగుల కోసం స్వచ్ఛమైన పరిసరాలు అందించడమే తమ లక్ష్యమని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ ఆసుపత్రికి ఇక్కడ ఉన్న వివిధ రకాల చెట్లు ఆసుపత్రికి వచ్చే రోగులకు స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయని ఆయన అన్నారు. పలు ఔషధ మొక్కలు కూడా నాటామని అవి కూడా రోగులకు స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయన్నారు. ఆసుపత్రి ప్రాంగణంతో పాటు ఆసుపత్రిలోని ఓపీ వార్డు, ఇన్ పేషంట్ వార్డు, ఓపీ రిజిస్ట్రేషన్ విభాగాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిశుభ్రతను పాటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వినాయక్‌రావు, గైనకాలజిస్టు డాక్టర్ అఫ్సా, డాక్టర్ తస్మీన్‌మెహర్ తదితరులున్నారు.